నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, ఆదివారం 21 జనవరి 2024 | KHAMMAM

ప్రసవాల సంఖ్య పెంచాలి : జిల్లా వైద్యాధికారి మాలతి

వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి మాలతి

కారేపల్లి, జనవరి 20 : ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలలో ప్రసవాల సంఖ్య పెంచడానికి వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి బి.మాలతి అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీతోపాటు బస్వాపురం, గాంధీపురం పల్లె దవాఖానలను శనివారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య సిబ్బంది ఆస్పత్రుల్లో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. పల్లె దవాఖానలు, పీహెచ్‌సీలలో విధులు నిర్వహించే సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. గ్రామాల్లో ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధులకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు రికార్డులను ఆమె పరిశీలించారు. ఆమె వెంట మండల వైద్యాధికారులు బి.సురేశ్, తేళ్ల శ్రేష్ఠసాఫల్య, పల్లె దవాఖాన వైద్యులు ప్రబంధ, రంజిత్ ఉన్నారు.

యాసంగి సాగేనా..?

- ఇంకా పొలాల్లోనే వానకాలం పంట
- ధర లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించని రైతులు
- బయటి వ్యాపారులకు అమ్ముకున్నా సకాలంలో అందని డబ్బులు
- వరి సాగుపై తేల్చుకోలేకపోతున్న రైతాంగం

భద్రాద్రి జిల్లాలో ఇప్పటివరకు 4,866 ఎకరాల్లోనే వరి నాట్లు

పాల్వంచ మండలంలో యాసంగి వరి నాట్లు వేస్తున్న రైతులు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో యాసంగి సాగుపై రైతుల్లో అయోమయం నెలకొన్నది. వానకాలంలో సాగు చేసిన వరి పంట అకాల వర్షాలు, తుఫాను కారణంగా దెబ్బతినడం.. ఉన్న కొద్దిపాటి పంట పూర్తిస్థాయిలో చేతికి రాకపోవడం.. చేతికొచ్చిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం.. బయటి వ్యాపారులకు విక్రయించిన పంట డబ్బులు ఇంకా రైతుల చేతికి అందకపోవడం వంటి తదితర కారణాలతో యాసంగి సాగుపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో గత ఏడాది కంటే ఈ సంవత్సరం యాసంగి వరి సాగు తగ్గేటట్లు కనిపిస్తున్నది. 2022-23లో వరి పంట 62,417 ఎకరాల్లో సాగు చేయగా.. ఈ ఏడాది ఇప్పటివరకు 4,866 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. జొన్న పంట కూడా 944 ఎకరాలకు.. 166 ఎకరాల్లో మాత్రమే సాగు చేసినట్లు వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో ఈసారి యాసంగి సాగు బాగా తగ్గింది. ఇదిలా ఉండగా.. ఇప్పటికే మార్కెట్‌లో బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. యాసంగి పంట సీజన్ పూర్తయిన తర్వాత వీటి ధరలు మరింతగా పెరిగే అవకాశం కనిపిస్తున్నది.

తగ్గిన సాగు విస్తీర్ణం..

యాసంగి సాగు విస్తీర్ణం గత ఏడాదితో పోల్చితే జిల్లాలో ఈ సంవత్సరం గణనీయంగా తగ్గింది. కారణాలు ఏమైనా.. రైతుబంధు సాయం ఆలస్యంగా అందడమా.. లేదా అకాల వర్షాలు గతంలో సాగు చేసిన పంటలను దెబ్బతీయడమా.. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడమా.. వెరసి యాసంగి పంట సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. గత ఏడాది 2,12,462 ఎకరాల్లో రైతులు పంటలు వేయగా.. ఈ ఏడాది సాధారణ సాగు 1,72,960గా వ్యవసాయాధికారులు నిర్ణయించారు. ఇప్పటివరకు 1,40,098 ఎకరాల్లో సాగయ్యాయి. ఇందులో వానకాలం వేసే పంటల విస్తీర్ణాన్ని కూడా కలిపి యాసంగి సాగు లెక్కలు తీశారు. మొక్కజొన్న 28,450 ఎకరాలు వేయగా.. ఈ ఏడాది 12,545 ఎకరాల్లో సాగు చేశారు. చివరికి కూరగాయల పంట కూడా గత ఏడాది 2,288 ఎకరాల్లో వేయగా.. ఈ ఏడాది 526 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో పొగాకు పంటను రైతులు చాలా వరకు తగ్గించారు. పొద్దుతిరుగుడు 501 ఎకరాలకు.. 110 ఎకరాల్లో వేశారు. వేరుశనగ గత ఏడాది 2,747 ఎకరాల్లో వేయగా.. ఈ ఏడాది 1,288 ఎకరాల్లో సాగు చేశారు. మొత్తంగా యాసంగి సాగుపై రైతులు ఎటూ తేల్చుకోలేకపోతున్నట్లు తెలుస్తోంది.

ఆలస్యంగా వరి కోతలు

వానకాలం సీజన్‌లో అకాల వర్షాలు, తుఫాను ప్రభావం పంటలపై చూపింది. దీంతో జిల్లాలో కోతలు ఆలస్యమయ్యాయి. ఇంకా పొలాల్లోనే పంట ఉంది. మార్చి వరకు యాసంగి వరి నాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. రైతుబంధు డబ్బులు కూడా రైతుల ఖాతాల్లో పడుతున్నాయి. ఈ నెల చివరికల్లా రైతుబంధు జమ అవుతుంది. వరి ధాన్యానికి బయట రేటు ఎక్కువ ఉండడం వల్ల రైతులు బయట విక్రయిస్తున్నారు. రైతులు యాసంగిలో ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి.

– కొర్సా అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

పారిశుధ్య పనులు పక్కాగా జరగాలి

భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

పాత పాల్వంచలోని జడ్పీహెచ్‌ఎస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక ఆల

పాల్వంచ, జనవరి 20 : ప్రతి రోజు మున్సిపల్ సిబ్బంది చేపట్టే పారిశుధ్య నిర్వహణ పనులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పరిశీలించి నివేదికలు అందజేయాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. శనివారం పాత పాల్వంచ జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 21వ తేదీ ఆదివారం అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపు ప్రక్రియను చేపడతారని, దీనిని సదరు ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2024, జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. శనివారం 1,095 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఫారం-6కు 519, ఫారం-7కు 155, ఫారం-8కు 223.. మొత్తం 897 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. అనంతరం పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్పనగర్, శ్రీనివాసకాలనీల్లో పారిశుధ్య కార్యక్రమాలను కలెక్టర్ పరిశీలించారు. మురుగు కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయాలన్నారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా గంబూషియా చేపలు, ఆయిల్‌బాల్స్ వేయాలని సూచించారు. కార్యక్రమాల్లో కొత్తగూడెం ఆర్డీవో శిరీష, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ స్వామి, తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్ ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి

మృతుల్లో ఇద్దరు మహిళలు

కొత్తగూడెం క్రైం, జనవరి 20 : ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు, జవాన్లకు మధ్య జరిగిన భీకరపోరులో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందిన ఘటన శనివారం బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బెలంగుట్ట సమీపంలో మావోయిస్టు పార్టీ డీవీసీఎం వినోద్ కర్మ, ఆవాపల్లి ఎల్‌ఓఎస్ రాజు పూనెం, ఏరియా కమిటీ సభ్యులు విశ్వనాథ్, గుడ్డు తేలం ఆధ్వర్యంలో సుమారు 25మందితో సమావేశం జరుగుతున్నట్లు పోలీస్ అధికారులకు సమాచారం తెలిసింది. ఈ మేరకు డీఆర్‌జీ, కోబ్రా 210 బెటాలియన్ సంయుక్త ఆధ్వర్యంలో సెర్చింగ్ ఆపరేషన్స్ నిర్వహించారు. ఈక్రమంలో బెలం గుట్ట సమీపంలో సుమారు ఉదయం 7:30 గంటల సయమంలో మావోయిస్టులు తారసపడి జవాన్లపై కాల్పులు ప్రారంభించారు. వెంటనే అప్రమత్తమైన జవాన్లు ఎదురుకాల్పులు జరిపారు. ఇరువర్గాల మధ్య సుమారు 15 నిమిషాలపాటు భీకరపోరు జరిగినట్లు తెలుస్తోంది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే ఎత్తైన గుట్టల మీదుగా దట్టమైన అటవీమార్గంలోకి పారిపోయినట్లు సమాచారం. కాల్పుల విరమణ అనంతరం ఆ ప్రాంతాన్ని జవాన్లు తమఆధీనంలోకి తీసుకుని గాలింపులు చేపట్టారు. ఈక్రమంలో జవాన్ల కాల్పుల్లో మృతిచెందిన ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలతోపాటు వారికి సంబంధించిన ఆయుధ, వస్తు సామగ్రి లభించాయి. మృతుల్లో ఇద్దరు మహిళా నక్సలైట్లు ఉన్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన బీజాపూర్ జిల్లా పోలీసులు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో గాలింపులు ముమ్మరం చేశారు.

మందుపాతర పేలి జవానుకి గాయాలు

కొత్తగూడెం క్రైం, జనవరి 20 : ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీల్లో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి జవానుకి గాయాలైన ఘటన శనివారం బీజాపూర్ జిల్లాలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా చిన్నగేలుర్ క్యాంపు నుంచి ఎస్‌టీఎఫ్ జవాన్లు ఏరియా డామినేషన్‌కు బయలుదేరారు. ఈక్రమంలో పోలీసులను టార్గెట్ చేస్తూ గుండెంతోయనాల్ వద్ద మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై ప్రమోద్‌శర్మ అనే జవాను కాలు వేయడంతో అది విస్ఫోటనం చెందింది. ఈ ఘటనలో సదరు ప్రమోద్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇది గమనించిన తోటి జవాన్లు క్షతగాత్రుడికి బీజాపూర్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి, వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఏయిర్‌లిఫ్ట్ ద్వారా రాయ్‌పూర్‌కి తరలించారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- పాఠశాలల్లో ఓటర్ల జాబితాను ప్రదర్శించిన హెచ్ఎంలు
- ఎన్నికల ప్రక్రియపై ఎంఈవోలతో సమీక్ష చేసిన డీఈవో

ఈర్లపూడి పాఠశాలలో ఎస్ఎంసీ నోటిఫికేషన్ పరిశీలిస్తున్న డీఈవో

ఖమ్మం ఎడ్యుకేషన్, జనవరి 20 : ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికల నిర్వహణకు విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. నోటిఫికేషన్ షెడ్యూల్‌లో ప్రకటించిన విధంగా ఎన్నికల ప్రక్రియకు అవసరమైన జాబితాలను రూపొందించింది. దీంతో జిల్లాలోని అన్ని పాఠశాలల హెచ్ఎంలు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే మండల స్థాయిలో ఎన్నికల నిర్వహణపై ఎంఈవోలు హెచ్ఎంలకు సూచనలు చేశారు. తరగతులవారీగా ప్రస్తుతం ఉన్న విద్యార్థుల జాబితాతోపాటు వారి తల్లిదండ్రుల జాబితాను రూపొందించారు. ఇందుకోసం పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక కసరత్తు చేస్తున్నారు.

నోటీసు బోర్డుపై జాబితాలు

డీఈవో ప్రకటించిన నోటిఫికేషన్ షెడ్యూల్‌కు అనుగుణంగా శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇందులో ఎన్నికకు సంబంధించిన అర్హతలు, నిబంధనలను స్పష్టంగా పేర్కొంటూ అందరికి తెలిసేలా నోటీసు బోర్డుపై పొందుపర్చారు. దీంతోపాటు శనివారం ఉదయం హెచ్ఎంలు పాఠశాల స్థాయినిబట్టి తోటి ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి.. విద్యార్థుల సంఖ్య(చైల్డ్ ఇన్ఫో ఆధారంగా)ను పోల్చి చూశారు. అనంతరం హెచ్ఎంలు నోటీసు బోర్డుపై ఓటరు జాబితాను ప్రదర్శించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో జిల్లావ్యాప్తంగా ఉన్న 1,300 పాఠశాలల్లో ఓటరు జాబితాను ప్రదర్శించారు.

ఎంఈవోలకు సూచనలు చేసిన డీఈవో

ఎస్ఎంసీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు డీఈవో కార్యాలయంలో ఎంఈవోలతో డీఈవో సోమశేఖర శర్మ శనివారం ఆన్‌లైన్ సమావేశంలో రివ్యూ నిర్వహించారు. ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధులు, పర్యవేక్షించాల్సిన విధానం, హెచ్ఎంలకు చేయాల్సిన మార్గదర్శకాలపై సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో హెచ్ఎం నుంచి వచ్చిన సందేహాలను నివృత్తి చేశారు. చైల్డ్ ఇన్ఫోలో లేకుండా పాఠశాలలో ఉండే విద్యార్థులను ఓటరు జాబితాలో ఉంచాలా.. లేదా.. అనే సందేహాలను కొందరు ఎంఈవోల దృష్టికి తెచ్చారు. వీటన్నింటిపై సమావేశంలో చర్చించి అభ్యంతరాల ఆధారంగా మార్పులు, చేర్పులు చేయాలని స్పష్టం చేశారు.

నర్సింగ్ సీట్ల భర్తీపై దృష్టి సారించాలి

భద్రాచలం, జనవరి 20 : రాష్ట్రంలోని 2 వేల బీఎస్సీ నర్సింగ్ సీట్ల భర్తీపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దృష్టి సారించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీ.కాళీప్రసాదరావు, కార్యదర్శి కే.విజయరావు, రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీ డాక్టర్ రాజేంద్రకుమార్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం భద్రాచలంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 121 నర్సింగ్ కళాశాలలు ఉండగా.. వాటిలో 6,500 బీఎస్సీ నర్సింగ్ సీట్లు ఉన్నాయన్నారు. ఆయా కళాశాలల్లో 4,500 కన్వీనర్ కోటా కింద, 2 వేల సీట్లు మేనేజ్‌మెంట్ కోటా కింద భర్తీ చేయాల్సి ఉందన్నారు. అయితే ప్రవేశాల కోసం కన్వీనర్, మేనేజ్‌మెంట్ వారికి ఒకే రకమైన నిబంధనలు వర్తింపజేస్తూ ఆదేశాలు జారీ చేశారని వారు తెలిపారు. కానీ.. తెలంగాణ ప్రభుత్వం, కేఎన్ఆర్ హెల్త్ యూనివర్సిటీ ఈ నిబంధనలు పాటించలేదని చెప్పారు. వెంటనే కన్వీనర్, మేనేజ్‌మెంట్ కోటాలో ఒకే రకమైన నిబంధనలు అమలు చేయాలని, ప్రస్తుత నిబంధనలను సడలించాలని వారు కోరారు. మిగిలిన సీట్లను ఇంటర్ బైపీసీ ర్యాంకు ఆధారంగా భర్తీ చేయాలని వారు పేర్కొన్నారు.

అధునాతన సేవలు అందించాలి

- డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు డాక్టర్ విక్రమ్‌రెడ్డి, డాక్టర్ ప్రమోద్‌కుమార్

ఖమ్మం సిటీ, జనవరి 20 : దంత వైద్యరంగంలో రోజురోజుకూ విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకొని అధునాతన సేవలు అందించాలని డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు డాక్టర్ విక్రమ్‌రెడ్డి, డాక్టర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడీఏ) ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఎస్ఆర్ డీజీ స్కూల్లో శనివారం నిర్వహించిన 8వ తెలంగాణ రాష్ట్ర దంత వైద్యుల సదస్సును వారు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సదస్సును ఖమ్మంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కాగా.. పాఠశాల ప్రాంగణంలో దంత వైద్యానికి సంబంధించిన అధునాతన పరికరాల ట్రేడ్ ఎగ్జిబిషన్ వైద్యులను ఎంతగానో ఆకట్టుకున్నది. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ కుతుంబాక శ్రీరామ్, సెక్రెటరీ డాక్టర్ నాగుబండి కిరణ్‌కుమార్, వైద్యులు సీహెచ్‌వీఆర్ నాగేశ్వరరావు, పీ.వెంకటేశ్వరరావు, కిశోర్‌గౌడ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పట్టని పట్టభద్రులు

- ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుపై అనాసక్తి
- నియోజకవర్గ వ్యాప్తంగా 72,408 మంది దరఖాస్తు
- గత ఎన్నికల్లో 5.05 లక్షల మంది ఓటర్లు
- ఓటు నమోదుకు వచ్చే నెల 6 వరకు అవకాశం
- ఓటు హక్కు నమోదుపై జిల్లా యంత్రాంగం విస్తృత ప్రచారం

పట్టభద్రుల ఓటు నమోదుపై సూచనలు చేస్తున్న నల్లగొండ కలెక్టర్ హరిచందన

నల్లగొండ ప్రతినిధి, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ - వరంగల్ - ఖమ్మం శాసన మండలి నియోజకవర్గంలోని పట్టభద్రులకు ఓటు హక్కు నమోదు పట్టడం లేదు. గత నెల 30 నుంచి దరఖాస్తులకు అవకాశం కల్పించినా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఫిబ్రవరి 6వరకు తుది గడువు ఉండగా.. ఇప్పటి వరకు 72,408 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. దీంతో నియోజకవర్గ పరిధిలోని జిల్లాల అధికారులు రంగంలోకి దిగారు. అర్హులైన పట్టభద్రులంతా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో 5.05లక్షల మంది ఓటర్లుగా నమోదు కాగా, ప్రస్తుతం చాలా తక్కువగా దరఖాస్తు చేసుకున్నారు.

2021లో పట్టుభద్రుల నియోజకవర్గం నుంచి గెలుపొందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇటీవల ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. అయితే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నిక జరిగే ప్రతిసారీ పట్టభద్రులంతా తిరిగి ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాల్సిందే. ఈ క్రమంలో రానున్న ఉప ఎన్నిక కోసం గత నెల 30నుంచి వచ్చే నెల 6 వరకు అర్హులైన పట్టభద్రులంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం ఉంది. కానీ.. శనివారం నాటికి నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 72,408 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. 12 జిల్లాలు, 23 రెవెన్యూ డివిజన్లు, 191 మండలాలతో విస్తరించి ఉన్న పట్టభద్రుల నియోజకవర్గంలో భారీ సంఖ్యలో పట్టభద్రులు ఉన్నా ఓటు నమోదుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఓటు నమోదుకు 16 రోజులు మాత్రమే మిగిలి ఉండగా.. మరో లక్ష నుంచి లక్షన్నర దరఖాస్తులు వస్తే ఎక్కువేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 2021 మార్చిలో జరిగిన ఎన్నిక కోసం అన్ని పార్టీలు, ఆశావహులు రంగంలోకి దిగడంతో రికార్డు స్థాయిలో 5,05,565 మంది ఓటర్లుగా నమోదయ్యారు. 2015 మార్చిలో జరిగిన ఎన్నికల్లో 2,81,138 మంది ఓటర్లుగా ఉన్నారు. ప్రస్తుతం ఉప ఎన్నిక కావడంతో ఏ మేరకు ఓటర్ల నమోదు జరుగుతుందో వేచి చూడాలి. పట్టభద్రుల ఓటు నమోదుపై రాజకీయ పార్టీలు, పోటీ చేయాలనుకునే ఆశావహులు దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. మరోవైపు జిల్లాల వారీగా అధికార యంత్రాంగం ఓటు హక్కు దరఖాస్తుపై విస్తృత ప్రచారం కల్పించేందుకు రంగంలోకి దిగింది. శనివారం నల్లగొండ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన మీడియా సమావేశం నిర్వహించి అర్హులైన పట్టభద్రులంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఖమ్మంలో గంజాయి ముఠా అరెస్టు

రూ.2 లక్షల విలువైన 8 కేజీల సరుకు, 7 సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం
తొమ్మిది మంది ముఠాగా ఏర్పడి ఖమ్మం, హైదరాబాద్‌లో విక్రయాలు
వీరి నుంచి కొని విక్రయిస్తున్న, వినియోగిస్తున్న 15 మందిని గుర్తించాం
మాదకద్రవ్యాలు విక్రయిస్తే సహించం: పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

మామిళ్లగూడెం, జనవరి 20: యువత మానసిక బలహీనతలను ఆసరాగా చేసుకున్న గంజాయి విక్రయంతోపాటు వినియోగానికి పురిగొల్పుతున్న ముఠాను ఖమ్మం టూటౌన్ పోలీసులు, టాస్క్‌ఫోర్సు పోలీసులు పక్కా సమాచారంతో పట్టుకున్నట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. నగరంలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. వైరా సంతబజార్‌కు చెందిన సిరిగిరి సురేశ్ అలియాస్ సంజయ్, ఏపీ కృష్ణా జిల్లా విసన్నపేటకు చెందిన జీవన్ అనే యువకులు కలిసి 2022 నుంచి గంజాయి విక్రయిస్తున్నారు. వొడాఫోన్ సంస్థలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న సురేశ్ మరికొందరితో పరిచయం పెంచుకొని గంజాయి విక్రయించేందుకు, వినియోగించేందుకు ముఠాగా ఏర్పాటు చేసుకున్నారు. వీరు ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దులోని చిత్రకొండ ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఖమ్మం, హైదరాబాద్ నగరాల్లో విక్రయిస్తున్నారు. వీరికి ఏపీలోని కృష్ణా జిల్లా గంపలగూడెం మండలం నెమలి గ్రామానికి చెందిన మునుబోలు ఏడుకొండలు గుణశేఖర్, వైరా ఫిష్‌కాలనికి చెందిన కంద్ర సతీశ్, వైరా మండలం ముసలిమడుగు గ్రామానికి చెంది హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న కరకాని ఇంద్రసేన గోపి, ఖమ్మం గోపాలపురం ప్రాంతానికి చెందిన బీ.రమేశ్, పొదిలి జశ్వంత్, కోణిజర్ల గ్రామానికి చెందిన కోమటి సురేశ్ సహకారం అందిస్తున్నారు. దీంతో వారు ఖమ్మంలోని విద్యార్థులు, యువతకు గంజాయిని విక్రయిస్తున్నారు. కాగా, పక్కా సమాచారం మేరకు ఖమ్మం టూటౌన్, టాస్క్‌ఫోర్సు పోలీసులు వీరి కదలికలపై నిఘా పెట్టి ఉంచారు. ఈ ముఠాలోని ఏడుగురిని తాజాగా అరెస్టు చేసి వారి నుంచి సుమారు రూ.2 లక్షల విలువైన 8 కేజీల గంజాయి, 7 సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. ఈ ముఠా నుంచి గంజాయిని కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్న, వినియోగిస్తున్న మరో 15 మందిని గుర్తించారు. ఈ ముఠా ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్న ఖమ్మం, పరిసర ప్రాంతాలకు చెందిన వారిలో చరణ్, లిఖిత్, సందీప్, రాహుల్, ఏ.రాజు, చరణ్, పవన్, భువన్, వంశీ, ప్రవీన్, మిక్కీ, సాయి, గోపి, లోకిత్, వివేక్ అనే యువకులను గుర్తించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వీరితోపాటు మరికొందరు కూడా ఉన్నందున వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. అయితే పిల్లలు గంజాయి బారిన పడినట్లుగా తల్లిదండ్రులు గుర్తిస్తే వెంటనే రిహాబిలేషన్ సెంటర్‌కు తరలించాలని సూచించారు. అలాగే, గంజాయి వంటి మాదకద్రవ్యాలు విక్రయించినా, వినియోగించినా సహించబోమని స్పష్టం చేశారు. ఏసీపీలు హరికృష్ణ, శివరామయ్య, సీఐ కుమారస్వామి పాల్గొన్నారు.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు కొత్తగూడెం నాట్యబృందం

'డాక్టర్ సీతాప్రసాద్'కు రెండోసారి అవకాశం

డాక్టర్ సీతాప్రసాద్, కూచిపూడి నృత్య కళాకారిణి

కొత్తగూడేనికి చెందిన దుర్గసాయి నృత్యనికేతన్ డాక్టర్ సీతాప్రసాద్ బృందం

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : దేశ రాజధాని ఢిల్లీలోని రాజ్‌పథ్ వద్ద జనవరి 26వ తేదీన జరిగే గణతంత్ర వేడుకల్లో నృత్య ప్రదర్శన చేసేందుకు కొత్తగూడెం కూచిపూడి కళాకారులకు అవకాశం దక్కింది. జిల్లాకేంద్రం కొత్తగూడెం పట్టణంలోని 'దుర్గసాయి నృత్యనికేతన్' డ్యాన్స్ స్కూల్‌కు చెందిన డాక్టర్ సీతాప్రసాద్ శిష్యబృందానికి ఈ అవకాశం రావడం ఇది రెండోసారి. సింగరేణిగడ్డపై పుట్టిన సీతాప్రసాద్ కూచిపూడిలో డిప్లొమా చేసి అంతర్జాతీయ కళాకారిణిగా గుర్తింపు సాధించారు. ఎంతోమందికి నాట్యం నేర్పి ఇతరదేశాల్లో సైతం గుర్తింపు తెచ్చుకున్న ఘనత తనది. అందుకే ఆమె డాక్టర్ సీతాప్రసాద్ అయ్యారు. సీతాప్రసాద్ శిష్యబృందం కూడా అదేబాటలో మార్కులు కొట్టేస్తున్నారు. వారంతా కొత్తగూడేనికి చెందిన కళాకారులే. గత 2022లో కూడా ఢిల్లీలో రాజ్‌పథ్ వద్ద జనవరి 26న ప్రదర్శన ఇచ్చారు. తర్వాత మళ్లీ ఈ ఏడాది అవకాశం రావడంతో ఈ నెల 1వ తేదీన ఢిల్లీ గడ్డపై అడుగుపెట్టి ప్రదర్శన కోసం శిక్షణ తీసుకుంటున్నారు. తన శిష్యబృందానికి రెండోసారి అవకాశం రావడం పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు డాక్టర్ సీతాప్రసాద్.